# వరి రైతుకు శాపంగా మారిన

# రైస్ మిల్లర్ల రాజ్యం??


# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక


సంపుటి : -13 సంచిక : 61 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

21-12-2025 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


**శ్రీకాకుళంలో సాగు కాదు దోపిడీ పంట పండుతోంది**

- మద్దతు ధర పేరుతో మిల్లర్ల మాయాజాలం
- తేమ' నెపంతో క్వింటాల్లకు కోతల వర్షం
- కొనుగోలు కేంద్రాలు ఉన్నా.. రైతుకు కొనుగోలు లేదు!
- వేల లారీలు, ట్రాక్టర్లు - రోడ్లపై పడిగాపులు పడుతున్న వరి
- మిల్లుల్లో నిబంధనల తుంగలో తొక్కింపు
- అధికారులు మౌనం..... రెచ్చిపోతున్న మిల్లర్లు
- అన్నదాత ఆగ్రహం - ప్రభుత్వానికి మంచి చేసేనా..?





ప్రతీకాత్మక చిత్రం

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం రాష్ట్రానికి అన్నం పెట్టే రైతు కన్నీళ్ల పంట పండుతోంది.వరి పండించే రైతుకు మద్దతు ఇవ్వాల్సిన వ్యవస్థ, అతడిని దోచే రైస్ మిల్లర్ల చేతుల్లో బందీ అయింది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP) రైతు చెవిన పడేలోపే,అదే వరి రైస్ మిల్లర్ గేటు దాటగానే చిల్లరగా మారిపోతోంది.

## 'తేమ ఉంది' -దోపిడీకి శాశ్వత ఆయుధం....

ఈ ఏడాది అకాల వర్షాలు రైతును ఇప్పటికే చిత్తు చేశాయి. అయినా సరే వరి కొనుగోలు చేయాల్సిన కేంద్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. రైతు వరి తీసుకొస్తే:"తేమ ఉంది""స్టాండర్డ్ లేదు""ఇంకా ఎండబెట్టాలి" అంటూ క్వింటాల్‌కు 5 నుంచి 12 కిలోల వరకూ కటింగ్ తో ఒక్కో రైతుకు ఇది వేల రూపాయల నష్టం కల్గుతొంది.

జిల్లా వ్యాప్తంగా వేలాది ట్రాక్టర్లు,,వందల లారీలు కొనుగోలు కేంద్రాల చుట్టూ రోజుల తరబడి నిలిచిపోయాయి.

వర్షం పడితే వరి తడుస్తోంది. తడిస్తే... మళ్లీ అదే మిల్లర్ "ఇది మేం కొనలేం" అంటే.. రైతుదే తప్పు,వ్యవస్థ మాత్రం పాపరహితం!, మిల్లుల్లో మాత్రం చట్టాలకు సెలవు, మిల్లులోకి వెళ్లిన వరి మాత్రం తేమ ఉన్నా సరే నాణ్యత లేకపోయినా సరే ప్రభుత్వానికి బియ్యంగా సరఫరా అవుతోంది. ఇది ఎలా సాధ్యమవుతోంది?

కొనుగోలు కేంద్రాల్లో కఠిన నిబంధనలు పాటించాలని అధికారులు చెబుతున్నప్పటికీ మిల్లుల్లో నిబంధనలును అడుగడుగునా ఉల్లంఘిస్తూ రైతును దోచేస్తున్నారు.ఇది స్పష్టమైన డబుల్ స్టాండర్డ్ పాలనఅని పాలకుకులు చెప్పుడకుంటున్నారు.శ్రీకాకుళం జిల్లాలో రైస్ మిల్లుల వ్యాపారం వేల కోట్లలో ఉంది.కానీ రైతు చేతికి వచ్చే మొత్తం మాత్రం ఎరువుల ఖర్చుకే సరిపోవడం లేదు, కూలీలకు కూలి చెల్లించలేని పరిస్థితి, అప్పుల ఊబిలో పతనం, అన్నదాతే అతి బలహీనంగా మారాడు. అధికారుల మౌనం- మిల్లర్లకు రక్షణ కవచమా అన్నట్లు అనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ గానీ, వ్యవసాయ శాఖ, జిల్లా యంత్రాంగం ఎక్కడా కఠిన చర్యలు లేవు.

ఫిర్యాదులు చేసిన రైతులకు "పై అధికారుల ఆదేశాలు"అనే ఒకే సమాధానం.మాత్రమే వస్తుంది."ఇది మద్దతు ధర కాదు.. మోసం ధర!" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."మిల్లర్లు లేకపోతే మేము బతకగలం!" అంటూ గళమెత్తుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతు పండిస్తే మిల్లర్ కొల్లగొడుతున్నాడు.ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది .ఇది ఎవరి వైఫల్యం?లేదా అన్నదాతపై జరుగుతున్న సంస్థాగత దోపిడీకి ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాల్సిందే.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మిల్లర్ల వద్ద ధాన్యం ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఉపాధి బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కార్యాచరణ
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల దిశానిర్దేశం




**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం స్థానిక జెడ్పీ నూతన సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ధాన్యం సేకరణలో రైతులు పడుతున్న ఇబ్బందులపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. రైతుల నుండి అదనంగా ధాన్యం తీసుకునే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘ సమీక్ష:**

సమావేశంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వంలో ప్రారంభించినా సరే, ప్రజలకు మేలు చేసే మంచి పద్ధతులను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగాలని, ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న మెటీరియల్ బిల్లులను తక్షణమే అప్‌లోడ్ చేసి రైతులకు, కూలీలకు న్యాయం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. సభలో అనవసర రాజకీయ విమర్శలు పక్కన పెట్టి, కేవలం ప్రజా సమస్యలపైనే చర్చ జరగాలని కోరారు. ఉపాధి పనుల నాణ్యతపై ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, బగ్గు రమణమూర్తి వారి వారి నియోజకవర్గాల్లోని పరిస్థితులపై మాట్లాడారు.



**ఆడిట్ ప్రక్రియ వేగవంతం చేయాలి:**

జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. ముఖ్యంగా ఎల్.ఎఫ్ ఆడిట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు పూర్తయినప్పటికీ ఆడిట్ జాప్యం వల్ల నిధుల విడుదల ఆగిపోకూడదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో


-మిగతా 2లో


# ఏపీయూడబ్ల్యూజే సెమినార్‌కు హాజరవుతానని మంత్రి లోకేష్ హామీ

- జనవరిలో రాష్ట్రస్థాయి జర్నలిస్టుల సెమినార్
- "సోషల్ మీడియా - ప్రస్తుత ధోరణులు" అంశంపై చర్చ
- తాడేపల్లిలో ఏపీయూడబ్ల్యూజే బృందంతో మంత్రి భేటీ
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి నారా లోకేష్
- జర్నలిస్టుల సమస్యలపై సానుకూల స్పందన
- పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబాటు
- ఐజేయూ 11వ ప్లీనరీకి మంత్రి శుభాకాంక్షలు
- విజయవాడ వేదికగా ఫిబ్రవరిలో ప్లీనరీ


2లో




ఎడిటోరియల్

# ఫిరాయింపుల పితలాటకం

'రాజకీయమంటే రాద్ధాంతం కాదు.. సిద్ధాంతం...' అన్నారు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్. కానీ ఇప్పుడు సిద్ధాంతాలు పక్కకుపోయి, రాద్ధాంతాలే ముందుకొస్తున్నాయి. పార్టీ ఫిరాయింపులు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి తాజాగా తన తీర్పును వెలువరించటంతో ఫిరాయింపుల ప్రహసనం మరోసారి తెరపైకొచ్చింది. అసలు ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నదేమిటి..? ఆనాడు విచ్చలవిడిగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ నేడు అదే విషయమై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. తమ పార్టీలో గెలిచి, అధికార హస్తం పార్టీకి అంటగాకుతున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలపై ఆ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. వారిపై అనర్హత వేటేయాలంటూ హైకోర్టు, సుప్రీంకోర్టు మెట్లెక్కింది. అటు తిరిగి, ఇటు తిరిగి బంతి మళ్లీ శాసనసభాపతి కోర్టుకే చేరింది. సర్వోన్నత న్యాయ స్థానం గురువారం తుది గడువు విధించటంతో స్పీకర్ బుధవారం తన తీర్పును వెలువరించారు. 'వారు పార్టీ మారారని చెప్పటానికి ఎలాంటి ఆధారాల్లేవ్' అంటూ ప్రధాన ప్రతిపక్షం వేసిన పిటిషన్లను కొట్టిపారేశారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్‌పై ఆయన గురువారం తన తీర్పును వెలువరించనున్నారు.

ఇదంతా ఇప్పటిదాకా జరిగిన, జరుగుతున్న తతంగం. ఇందులో సాంకేతిక, న్యాయ పరమైన అంశాలను పక్కనబెడితే%ా% అసలు మన రాజకీయ వ్యవస్థ ఎటుపోతోందంటూ ఆవేదన చెందక తప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలో అమల్లోకి వచ్చిన తర్వాత రాజకీయాల్లో విలువలు వలువల్లాగా ఊడిపోతున్నాయి. పాలిటిక్స్, బిజినెస్ మిక్సయిపోయి 'క్విడ్ ప్రోకో'అంటే నాకిది, నీకది అనే చందంగా వ్యవహారాలు నడుస్తున్నాయి. 1991 కంటే ముందు వ్యాపార, పారిశ్రామికవేత్తలు తెరవెనకుండి 'తతంగం' నడిపించేవారు. తమకు అనుకూలమైన రాజకీయ నేతలకు ఫండింగ్ ఇచ్చి.. వారిని తమ ప్రతినిధిగా చట్టసభలకు పంపి, తమ ప్రయోజనాలను కాపాడుకునేవారు. కానీ గత పాతికేండ్ల నుంచి వారు మరింత దూకుడుగా వ్యవహరిస్తూ, నాలుగడుగులు ముందుకేసి, ఏకంగా తామే రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేస్తుండటం పరిపాటిగా మారింది. ఎన్నికల్లో గెలవటం కోసం వ్యాపారాల్లో అక్రమంగా సంపాదించిన డబ్బును కుమ్మరిం చటం, అప్పనంగా వచ్చిన సొమ్మును కాపాడుకోవటం కోసం మళ్లీ రాజకీయాలను వాడుకోవటమనేది మారిన 'పాలిట్రిక్స్ ట్రెండ్'కు నిదర్శనం. దీనిపై ఎవరైనా నిలదీస్తే' అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నాం' అని సమాధానం చెప్పటం, రివాజుగా మారటమనేది దిగజారిన రాజకీయ విలువలకు పరాకాష్ట. వారు, వీరు అనే తేడా లేకుండా పాలక పార్టీలన్నీ వీటిని ప్రోత్సహిస్తుండటంతో 'పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం' నిర్వీరబోతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అసలు ప్రజలు, వారేసే ఓట్లు, ప్రజాభిప్రాయమనేవి గంగలో కలిసిపోతుండటం అత్యంత విషాదకరం. ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. ఒక పార్టీకి చెందిన అభ్యర్థిని ఏ కారణం చేతనో ప్రజలు వ్యతిరేకించి, ఇంకొకర్ని గెలిపిస్తే, ఆ గెలిచిన వ్యక్తి, ప్రజాభిప్రాయానికి భిన్నంగా జనాలు వ్యతిరేకించిన పార్టీలోనే చేరితే.. ఇక ఎన్నికల వ్యవస్థకు అర్థమేముంది? అసలు ఇంత ఖర్చుపెట్టి ఎలక్షన్లను నిర్వహించాల్సిన అవసరమేంటి? అనే సందేహాలు వెల్లువెత్తకమానవు. 'ఏ పార్టీ నుంచి గెలిచి, సర్పంచు అయినా, చివరకు పనుల కోసం మా వద్దకు రావాల్సిందే, మా కండువా కప్పుకోవాల్సిందే' అంటూ గతంలో బీఆర్ఎస్, తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

'అందుగలడిందుగలడనే సందేహము వలదు' అన్నట్టు ఈ ఫిరాయింపులు పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా సర్వాంతర్యామి అయిపోయాయి. అందుకే మన దేశంలో ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసి.. దామాషా పద్ధతిన ఎలక్షన్లు జరపాలంటూ మేధావులు, సామాజిక వేత్తలు కోరుతున్నారు. దీనిపై ప్రజల్లో చర్చ జరగాలి. వారిలో చైతన్యం రావాలి.. అప్పుడే మార్పు సాధ్యం.

ఇక్కడ తెలంగాణ వచ్చిన కొత్తలో జరిగిన ఒక సంఘటనను గుర్తు చేయాల్సిన అవసరముంది. ఆనాటి అధికార బీఆర్ఎస్.. ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను తనవైపు లాక్కోవటానికి 'ఆకర్షణ' మంత్రం వేసింది. గులాబీ పార్టీ వేసిన ఆ గాలానికి నాటి ప్రధాన ప్రతిపక్షం కకావికలమైంది. నేటి ఉప ముఖ్యమంత్రి, నాటి సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క.. ప్రతిపక్ష నేత హెూదాను సైతం కోల్పోవాల్సి వచ్చింది. ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల నుంచి అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు 'కారె'క్కారు. కానీ ఒకే ఒక్కడు'నువ్వు ముఖ్యమంత్రి పదవినిచ్చినా నేను మాత్రం పార్టీ మారేది లేదు' అని తెగేసి చెప్పారు. ఆయన మరెవరో కాదు.. సీపీఐ(ఎం) సీనియర్ ఎమ్మెల్యే సున్నం రాజయ్య. రాజకీయ విలువలకు, సిద్ధాంత నిబద్ధతకు ఇదీ అసలు సిసలు రూపం.

# వైయస్ జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనాలి

- ప్రగతి భవన్‌లో సేవా కార్యక్రమాలు
- వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు




నవతరం-పలాస

వైయస్సార్సీపి అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించాలని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ ఆదివారం 10 గంటలకు పలాస లోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో వైయస్ జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పలాస నియోజకవర్గ పరిధిలో వజ్రపు కొత్తూరు, మందస, పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ లలో కూడా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ప్రగతి భవన్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపీటీసీలు తోపాటు వైయస్ఆర్సీపీ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని బమ్మిడి దుర్యోధనరావు కోరారు.

# ఏపీయూడబ్ల్యూజే సెమినార్‌కు హాజరవుతానని మంత్రి లోకేష్ హామీ

**నవతరం -అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో వచ్చే జనవరిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సెమినార్‌కు హాజరవుతానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. శనివారం ఉదయం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందాన్ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ భేటీలో ఐజేయూ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కామ్రేడ్ శ్రీనివాస రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జర్నలిజం రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా ప్రస్తుత సోషల్ మీడియా ధోరణులు, వాటి ప్రభావం, జర్నలిస్టుల పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. "సోషల్ మీడియా - ప్రస్తుత ధోరణులు" అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జనవరిలో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు వివరించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించగా, మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ తన అంగీకారాన్ని తెలిపారు.

అదేవిధంగా జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటిని సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఫిబ్రవరిలో విజయవాడలో జరగనున్న ఐజేయూ 11వ ప్లీనరీ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఉపాధ్యక్షులు చావరవి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా

- టెక్కలి నియోజకవర్గంలో 194 మందికి రూ. 2.26 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- జనవరి నుంచి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య బీమా
- వైద్యం కోసం రూ. 2,000 కోట్లు వెచ్చించిన ఘనత సీఎం చంద్రబాబుదే
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**నవతరం -కోటబొమ్మాళి**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి, ముఖ్యంగా పేదల ఆరోగ్యానికి పూర్తి భరోసా ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం కోటబొమ్మాళి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ. 25,44,580 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని, బాధితులకు సకాలంలో ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటివరకు 194 మందికి రూ. 2.26 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 'ఆరోగ్యశ్రీ' పేరు చెప్పి ప్రైవేటు ఆసుపత్రులకు ఐదేళ్లలో నయాపైసా చెల్లించలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. బకాయిలు చెల్లించకపోవడంతో ఆసుపత్రులు పేదలకు చికిత్స నిరాకరించాయని, ఫలితంగా సామాన్యులు అప్పుల పాలై నరకం అనుభవించారని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదవాడి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు. అందులో భాగంగానే వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రతి పేద కుటుంబానికి రూ. 25 లక్షల వరకు వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 2,000 కోట్లకు పైగా నిధులను సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదల చేసి పేదల ప్రాణాలు కాపాడిందని వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిధుల పంపిణీ వివరాలను వెల్లడిస్తూ.. కోటబొమ్మాళి మండలంలో 75 దరఖాస్తులకు గాను 61 మందికి రూ. 67,51,975 మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. అలాగే సంతబొమ్మాళి మండలంలో 85 దరఖాస్తులకు గాను 69 మందికి రూ. 9,31,837 పంపిణీ చేయగా, టెక్కలి మండలంలో 34 దరఖాస్తులకు 27 మందికి రూ. 28,92,178 మంజూరయ్యాయని వివరించారు. నందిగాం మండలంలో 43 దరఖాస్తులు అందగా 37 మందికి రూ. 36,90,431 అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, స్థానిక కూటమి నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఈ నెల 24 న జాతీయ వినియోగదారుల

# హక్కుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

డీ ఎస్ ఓ సూర్యప్రకాశ రావు




**నవతరం -శ్రీకాకుళం**

జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి డీ ఎస్ ఓ సూర్యప్రకాశ రావు కోరారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన కార్యాలయం లో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ గోడపత్రిక ను ఆవిష్కరించారు.. ఈ నెల 24 న జరగనున్న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడే సంఘాలు అన్ని భాగస్వామ్యం కావాలన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల లో ఈనెల 24 తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు గోపాల్, మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ ప్రభర్ రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఆశ్రా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా,ఆశ్రా ప్రతినిధులు కె. పి. సారధ, బాలకృష్ణ పట్నాయక్, వేణుగోపాల్. కిరణ్ తదితరులు పాల్గొన్నారు...

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొదటిపేజీ తరువాయి

అప్‌లోడ్ చేసి చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులకు మార్గదర్శనం చేశారు.

**ధాన్యం కొనుగోలులో పారదర్శకత: జాయింట్ కలెక్టర్**

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులు ఎలాంటి నష్టానికి గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. కొందరు మిల్లర్లు తేమ శాతం, నూకల సాకుతో రైతుల నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎవరైనా రైతులను ఇబ్బంది పెడితే వారిని వెంటనే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

**వ్యవసాయం, ఉపాధిపై కలెక్టర్ భరోసా:**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా పొటాషియం, యూరియా సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులకు మేలు చేసే ఉద్దేశంతోనే ప్రతి మిల్లర్‌కు రేటింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీనివల్ల రైతులు తమకు నచ్చిన, ఉత్తమ సేవలు అందించే మిల్లును ఎంచుకునే వెసులుబాటు కలుగుతుందని వివరించారు . డ్వామా పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 4.44 లక్షల మంది వేతనదారులకు పని కల్పించినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కవి కలమే త్రిశూలమైతే..?


కవి కలమే...
ఒక హలమైతే..?
అక్షరాల విత్తనాలు చల్లి
జ్ఞాన తృష్ణను తీర్చే
ఖండకావ్యాలు పండించే
కర్షకుడౌతాడు కవి..!

కవి కలమే...
ఒక త్రిశూలమైతే..?
అంతర్ముఖ తపస్సుతో
జ్ఞానఖడ్గంతో
అజ్ఞానాన్ని చీల్చే
త్రినేత్రుడౌతాడు కవి..!

కవి కలమే...
ఒక గాలమైతే...?
అభ్యుదయ
సమాజ సాగరంలో
విచ్చలవిడిగా తిరిగే
వీర విహారం చేసే
అవినీతి తిమింగలాలను
వేటాడే
మత్స్యకారుడౌతాడు
కవి..!

కవి కలమే...
ఒక వజ్రాయుధమైతే..?
అహంకారపు
సంకెళ్ళు తెంచుతూ
అజ్ఞానాంధకారాన్ని
ఛేదిస్తూ
అణచివేతలకు గురైన
అంటరానితనానికి
బలైన
అమాయకపు జనానికి
జాగృతి గీతమౌతాడు
రక్షణ కవచమౌతాడు
కవి..!

కవి కలమే...
ఒక అణుబాంబైతే..?
నరహంతకులను
నిర్మూలిస్తూ
కుళ్ళిన వ్యవస్థను శుద్ధి
చేస్తాడు
నవసమాజ నిర్మాణానికి
పునాది వేస్తాడు కవి..!



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# తూర్పు సిందూరం సుబ్బారావు పాణిగ్రాహి



(డిసెంబర్ 22 విప్లవ ప్రజాకవి వర్ధంతి)

"ఎరుపంటే కొందరికి భయం భయంపసిపిల్లలు వారి కంటే నయం నయం"అంటూ తన పాటలతో ప్రజల గుండెల్లో విప్లవ జ్వాలలు రగిలించిన విప్లవ ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రాహి. 1934 సెప్టెంబర్ 8న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలో ఒక సంప్రదాయ పూజారి కుటుంబంలో జన్మించారు. సంప్రదాయ నేపథ్యం నుంచే బయలుదేరినా, తన ఆలోచనలతో కులగోడలను కూల్చి, విశాల హృదయంతో ప్రజల పక్షాన నిలిచిన విప్లవకారుడిగా ఎదిగారు. గ్రామీణ జీవితంలో కనిపించిన అణచివేత, అన్యాయం ఆయనను అంతర్మథనం నుంచి ఉద్యమ మార్గంలోకి నడిపించింది. కళను ఆయుధంగా మార్చిన ఆ మార్పు నిజంగా ఒక అద్భుతమైన చారిత్రక పరిణామం.కళను కేవలం వినోదానికి కాకుండా ప్రజా ప్రయోజనార్థంగా మలిచిన మహానుభావుడు పాణిగ్రాహి. అజ్ఞానపు అంధకారంలో మగ్గుతున్న బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపాలనే తపనతో తన జీవితాన్నే ఫణంగా పెట్టారు. ఆ పోరాటంలో జైలు జీవితం కూడా ఆయనకు భయంగా అనిపించలేదు.బొడ్డపాడు గ్రామానికి పూజారిగా వచ్చిన సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న సామాజిక అన్యాయాలు ఆయనను తీవ్రంగా కదిలించాయి. తామాడ గణపతి, పంచాది కృష్ణమూర్తిలతో ఏర్పడిన పరిచయం ఆయనను ఉద్యమ దిశగా మరింత ముందుకు నడిపించింది. యువతను పోరాటాలకు ప్రేరేపించేందుకు పాటలు, గేయాలు, నాటకాలను ఆయుధాలుగా మార్చారు. భయంతో వెనుకంజ వేసినవారిలో ధైర్యాన్ని నింపేలా ఆయన రచనలు ఉద్యమాలకు కొత్త ఊపిరి పోశాయి.తామాడ చినబాబుతో కలిసి చెప్పిన జముకుల కథలు ప్రజల నరనరాల్లో ఉత్సాహాన్ని నింపాయి."ఓ అరుణ పతాకమా, చెగొనుమా రెడ్ సల్యూట్" వంటి గీతాలు విప్లవకారుల నిత్య జెండావందన గీతాలుగా మారాయి.నక్సల్బరీ ఉద్యమ పిలుపుతో ప్రేరితుడై భారత పాలక వర్గాల అన్యాయానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పాణిగ్రాహి చేతిలో ఉన్న ఆయుధం తుపాకీ కాదు జముకు."కూడు లేని, గూడు లేని నిర్భాగ్యుల జీవితాలు పాడవుతుంటేఆయుధాల ఆకువేసి తుపాకీతో నడిస్తేమీ ఊహలే తలకిందులవుతాయి"అంటూ చేసిన హెచ్చరిక ఆనాటి పాలకవర్గాలను భయకంపితులను చేసింది.పాటలతో పాటు నాటకరంగంలో కూడా ఆయన ప్రజలను చైతన్యవంతులను చేశారు. కుంకుమరేఖ, రిక్షావాలా, ఎండమావులు, కాలచక్రం, విముక్తి వంటి నాటికలను రచించి గ్రామసీమల్లో ప్రదర్శింపజేసి సామాజిక చైతన్యాన్ని రగిలించారు.ఎంతకాలం బ్రతికామన్నది కాదు ముఖ్యం;బతికినన్నాళ్లూ ప్రజల గుండెల్లో నిలిచామా లేదా అన్నదే జీవిత సార్థకత.పాణిగ్రాహి కేవలం 36 సంవత్సరాలు మాత్రమే జీవించినా, ఆయన పోరాటం నేటికీ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది. 1969 డిసెంబర్ 22న రంగమటియ కొండల్లో ఆయనను కాల్చి చంపారు. కానీ ఆ రక్తపు మరకల నుంచే ఉద్యమ బీజాలు మొలిచాయి; ఆ జ్వాలలు నేటికీ సమాజంలో కనిపిస్తూనే ఉన్నాయి.సుబ్బారావు పాణిగ్రాహి జీవితంపై శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు కె. ముత్యం రచించిన గ్రంథం ఆయనకు సరైన సాహిత్య నివాళిగా చెప్పుకోవచ్చు.సలాం సలాం విప్లవ వీరుడా!సుబ్బారావు పాణిగ్రాహి నీకు సలాం సలాం!(ప్రజాకళామండలి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 22న బొడ్డపాడు గ్రామంలో సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ జరగనుంది.)



వ్యాసకర్త: **లలితారెడ్డి**
తెలుగు ఉపాధ్యాయిని
కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, శ్రీకాకుళం

## పెద్దపాడులో ముస్తాబు ప్రారంభం




**నవతరం -శ్రీకాకుళం**

మన్యం జిల్లాలో అమలవుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా పెద్దపాడులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 79 లక్షల మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం చేరేలా అమలు చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ అలవాటుగా మారితే వారి ఇళ్ల పరిసరాలు కూడా శుభ్రంగా మారుతాయని, తద్వారా సుమారు రెండు కోట్ల మంది కుటుంబ సభ్యుల్లో సామాజిక మార్పు వస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. చిన్నతనంలోనే శుభ్రతపై అవగాహన కల్పిస్తే అది జీవితాంతం కొనసాగుతుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ దేవి తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రారంభమైన ఈ మార్పు కుటుంబాలు, సమాజం వరకు విస్తరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి లత, రంగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని పాఠశాలలో నిరంతరం అమలు చేస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# వాళ్లందరికీ పోటీగా ఆ విలన్ మారేనా?



బాలీవుడ్ నటులు సంజయ్ దత్, బాబి డియెల్ లాంటి నటులు సౌత్ మార్కెట్ టార్గెట్ గా సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. కొంత కాలంగా స్టార్ హీరోల చిత్రాల్లో ప్రధాన విలన్లగా మారుతున్నారు. మరో బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ కూడా దేవరతో విలన్ గా ఎంట్రీ ఇచ్చాడు. ఓజీతో ఇమ్రాన్ హష్మీ కూడా తెలు గులో విలన్ గా లాంచ్ అయ్యాడు. ఇంకా మాలీవుడ్ నుంచి పహాద్ పాజిల్, షైన్ టామ్ చాకో, పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. టివినో థామస్ కూడా ఎన్టీఆర్ సినిమాలో విలన్ గా నటిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది.

అతడితో పోటీ కష్టమా? ఇక కోలీవుడ్ నుంచి సముద్రఖని లాంటి నటులు సౌత్ లో ఎక్కువగా విలన్ పాత్రలు..కీలక పాత్రల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. దాదాపు తెలుగు స్టార్ హీరోలు నటిస్తోన్న అన్ని చిత్రాల్లోనూ వీళ్లే రిపీట్ అవుతున్నారు. తాజాగా వీళ్ల స్పీడ్ కి బ్రేక్ వేయడానికి బాలీవుడ్ నుంచి మరో నటుడు దిగే అవకాశం కనిపిస్తోంది. భవిష్యత్ లో అతడి పోటీని తట్టుకోవడం అంత సులభం కాదు. ఇంతకీ ఎవరా స్టార్ అంటే? అక్షయ్ ఖన్నాగా ప్రచారం జరుగుతోంది. ఛావా రిలీజ్ తో అక్షయ్ కన్నా సౌత్ లో వెలుగులోకి వచ్చాడు. హిందీ సినిమా అయినా? అందులో ఔరంగజేపు పాత్రలో అదరగొట్టాడు. వైవిధ్యమైన నటనతో సౌత్ ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అయ్యాడు. తాజాగా రిలీజ్ అయిన ధురంధర్ తో అతడి క్రేజ్ రెట్టింపు అయింది. రెహమాన్ డెకాయత్ పాత్రలో అక్షయ్ కన్నా స్వాగ్ కి ఫిదా కాని వారుండరు. ఎక్కడ చూసినా అతడి పాత్ర గురించే చర్చ జరుగుతోంది. ప్రత్యేకించి తెలుగు ఇండస్ట్రీలో అక్షయ్ కన్నా? గురించి మాట్లా డుకోవడం ఇదే తొలిసారి. బాలీవుడ్ కి వినోద్ ఖాన్నా వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన అక్షయ్ ఖన్నా హీరోగా ఓ వెలుగు వెలిగాడు. ఆ తర్వాత ఇండస్ట్రీకి ఒక్కసారిగా దూరమయ్యాడు. దాదాపు మూడేళ్ల కంబ్యాక్ తర్వాత విలన్ పాత్రల్లో అదరగొడుతున్నాడు.

మహాకాళీ రిలీజ్ అనంతరం: బాలీవుడ్ లో ఇప్పటికే కొన్ని సినిమాలతో బిజీగా ఉన్నాడు. మహాకాళీ సినిమాతో తెలుగులోనూ లాంచ్ అవుతున్నాడు. భవిష్యత్ లో మరిన్ని అవకాశాలు అందు కుం టాడు. అతడు సౌత్ సహా తెలుగులో బిజీ అయితే పైన ప్రస్తావించిన నటులుంతా ఖాళీ అవ్వాల్సిందే. అక్షయ్ ఖన్నా ఇంకా సీరియస్ గా సౌత్ సిని మాలపై దృష్టి పెట్టలేదు. కొత్త ఏడాది మహాకాళీ రిలీజ్ అవుతుంది. అనంతరం అక్షయ్ ఖన్నా టాలీవుడ్ పై మరింత సీరియస్ గా దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# మరింత ఇరుకుగా మారిన సంక్రాంతి పోటీ



ఇవాల్టితో సంక్రాంతి సినిమాలపై పూర్తి స్పష్టత వచ్చేసింది. అన్ని సినిమాల విడుదల తేదీలు వచ్చేశాయి. రాజాసాబ్ ను మినహాయిస్తే, ఎన్నడూలేని విధంగా కేవలం 3 రోజుల వ్యవధిలో 4 సినిమాలు రిలీజ్ అవుతున్నాయి.

రాజాసాబ్ తో సంక్రాంతి సినిమాల సందడి మొదలవుతుంది. జనవరి 9వ నుంచి ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది. తాజాగా ఈ విషయాన్ని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మరోసారి స్పష్టం చేశారు. రాజాసాబ్ వచ్చిన 3 రోజుల గ్యాప్ లో, జనవరి 12న మన శంకరవర ప్రసాద్ గారు సినిమా రాబోతోంది. చిరంజీవి హీరోగా నటించిన ఈ సినిమాకు తాజాగా విడుదల తేదీ ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది. చిరంజీవి సినిమా వచ్చిన మరుసటి రోజే భర్తమహాశయులకు విజ్ఞప్తి సినిమా వస్తోంది. రవితేజ హీరోగా నటించిన ఈ సినిమాను జనవరి 13న విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారు.

ఇక ఈ సినిమా వచ్చిన 24 గంటల వ్యవధిలో నారీనారీ నడుమ మురారి సినిమా ప్రీమియర్స్ మొదలుపెడతారు. శర్వానంద్ నటించిన ఈ సినిమాను పూర్తిస్థాయిలో జనవరి 15 నుంచి ప్రదర్శించబోతున్నారు.

ఇక్కడితో పోటీ అయిపోలేదు. లిస్ట్ లో డబ్బింగ్ సినిమాలు కూడా ఉన్నాయి. 9న జననాయకుడు, 14న పరాశక్తి సినిమాలు వస్తున్నాయి. పరాశక్తి సినిమా అయితే అనుకున్న టైమ్ కంటే 3 రోజుల ముందే థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉందంటూ కోలీవుడ్ నుంచి ఫీలర్లు కూడా వస్తున్నాయి. మొత్తానికి ఈ సంక్రాంతికి 6 సినిమాలు పోటీ పడడం ప్రస్తుతానికి ఖాయం.

## శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి ఎస్ ఎం ఫణి కుమార్



**నవతరం- టెక్కలి**
శనివారం టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్స్పెక్షన్‌లో భాగంగా కోర్టు దస్త్రాలను శ్రీకాకుళం జిల్లా నాలుగవ అదనపు న్యాయమూర్తి ఎస్. ఎమ్. ఫణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రావివలస శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి వారైన శ్రీమతి బి. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కష్టజీవుల ఉపాధిని నిర్వీర్యం చేస్తే ఊరుకోము

### టెక్కలి వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వం




**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి మండలం పరిధిలోపంచాయతీ భవనం ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహం ముందు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు జిల్లా నాయకులు కొల్లి ఎల్లయ్య ఆధ్వర్యం లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వీ జీ జి ఆర్ ఏ ఎం జి గా పేరు మార్పడంపైన, మరియు ఈచట్టంలో చేసిన సవరణలపైన రాష్ట్ర సంఘం ఇచ్చిన నపిలుపుమేరకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. గాంధీని చంపిన గాడ్సే వారసులు అయిన నేటి మన పాలకులు కార్మికులు, కష్టజీవులు సంపద సృష్టికర్తలను అణగద్రొక్కుతూ దోపిడీ దారులు అయిన కార్పొరేట్లను పెంచుతున్నారని నాయకులు అన్నారు. శరీరంపై గామంచా కప్పుకొని దేశమంతా తిరిగి ప్రజలను కూడగట్టి స్వాతంత్రం కోసం బ్రిటిష్ వాళ్ళతో పోరాడిన మహాత్ముడు పేరును మార్పు చేయడం న్యాయమా అంటూ నిరసన కార్యక్రమంలో నినాదాలు చేశారు. ఈ చట్టంలో కేంద్రప్రభుత్వం 90శాతం ఇవ్వాల్సిన వాటాను 60శాతానికి కుదించుకొని, రాష్ట్రం పై 40 శాతం వరకు అదనం భారం వేసారు అని వారి ఆవేదన వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య తోపాటు నంబూరు షణ్ముఖరావు, హెచ్ ఈశ్వరరావు, యు.లక్ష్మణరావు, బి ధర్మారావు, సరస్వతి, సుబ్రహ్మణ్యం ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బాలవ్యాకరణ కర్త చిన్నయ సూరి జయంతి




**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక సాహితీ చైతన్యకిరాణాలు, బాలకదాథా నిలయం అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పరవస్తు చిన్నయసూరి జయంతిని శనివారం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కి చెందిన లేఖ సాహిత్యవేదిక అధ్యక్షులు జె.వి.చంద్రబాబు, మోటూరు నారాయణ రావు, డి గోవిందరావు, ఆర్. వి. రమణ మూర్తి, వాడాడశ్రేనివాసరావు తదితరులు పాల్గొన్నారు..

# సహనం ఓర్పుతోనే ఉత్తమ ఫలితాలు

### విద్యాజ్యోతి సంస్థ ఇన్‌ఛార్జ్ ఎం. జనార్ధనరావు



**నవతరం-సరుబుజ్జిలి**

సహనం ఓర్పుతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యపడతాయని శ్రీకాకుళం సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి ఇన్ చార్జ్ ఎం. జనార్దనరావు పేర్కొన్నారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి ఆధ్వర్యంలో కళాశాల జాతీయ సేవా పథకం, ఈగల్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దనరావు మాట్లాడుతూ.. కృషి పట్టుదల సహనము ఓర్పు ఉంటే విద్యార్థులు ఉన్న స్థితి నుంచి ఉన్న స్థానానికి వెళ్తారని సూచించారు. కృషి వుంటే మనుషులు రుషలవుతారో లేదో తెలియదు గాని కసి ఉంటే మనుషులు రుషలవడం ఖాయమని చెప్పారు.

**వాచ్ చేయడం ముఖ్యం..**

చూడటం (వాచ్) కోసం తెలియజేస్తూ.. మనం మాటల్ని వాచ్ చేయాలని, మన ఆలోచనల్ని వాచ్ చేయాలని, మన పనుల్ని వాచ్ చేయాలని, మన హృదయాన్ని వాచ్ చేయాలని.. అదే పాజిటివ్ మైండ్ కి ప్రత్యేకమైన తార్కానమని తెలియజేస్తు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. ప్రిన్సిపాల్ పైడి పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన చదువుతోపాటు క్రమశిక్షణ, గౌరవ మర్యాదలు ముఖ్యమన్నారు. మంచి నడవడిక, సత్ ప్రవర్తనను కలిగి ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు, కళాశాలకు గౌరవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్ పీఓ రమేష్ సాహు, ఈగల్ క్లబ్ కన్వీనర్ జె.ఉపేంద్ర, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ శ్రీకాకుళమే మన లక్ష్యం

### 31 డివిజన్ ఇంచార్జి, ఏపీ ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ విభూది సూరిబాబు వెల్లడించారు

**నవతరం-శ్రీకాకుళం**




స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు స్థానిక దండి వీధిలో సచివాలయం ఉద్యోగులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా మనమంతా పనిచేద్దామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. పరిసరాల్లో వున్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు కార్యక్రమం ను ఎప్పటి కప్పుడు చేపట్టాలని సచివాలయం సిబ్బంది కి సూచించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనలు, సహాకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పోలియోరహిత ప్రపంచమే లక్ష్యం....

### వైద్యాధికారి డా. ఎం విశ్వనాథ్ గంగాధర్



**నవతరం-శ్రీకాకుళం**
శనివారం ఉదయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండు గోపాలపురం సంయుక్త ఆధ్వర్యంలో పల్స్ పోలియో దినం అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డా.ఎం విశ్వనాథ్ గంగాధర్ మాట్లాడుతూ మన దేశం పోలియో రహిత దేశం అయినప్పటికీ పక్కనే ఉన్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో ఇప్పటికీ పోలియో కేసులు నమోదు అవుతుండడం వల్ల మనం మరింత జాగ్రత్తతో వ్యవహరించి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దండు గోపాలపురం పరిధిలో నాలుగు సచివాలయాలలో 11 పోలియో చుక్కల కేంద్రాలను, దండు గోపాలపురం కోటబొమ్మాలి రైల్వేస్టేషన్లో ట్రాన్సిట్ కేంద్రాలను, ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేశామని ,897 మంది ఐదేళ్ల లోపల చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వెయ్యాలనే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు , అంగన్వాడి కార్యకర్తలతో శతశాతం పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి గంగన్న మాట్లాడుతూ విద్యార్థులంతా తమ గ్రామాల్లో ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వి వి ఎస్ ఎస్ నాగేశ్వరరావు, ఆప్తాలమిక్ అధికారి ఎమ్ ఆర్ కె దాస్, ఆరోగ్య విస్తరణ అధికారి కే కృష్ణారావు, వి వి కామేశ్వరి, ఉపాధ్యాయులు టి భాస్కరరావు, లక్ష్మీనారాయణ, అన్నాజీ, రాము ,పీడీ పి తిరుపతి రావు, రోటరీ ప్రతినిధులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రమదానంతోనే స్వచ్ఛత సాధ్యం

**నవతరం-శ్రీకాకుళం**

రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర దిశగా గ్రామాల వికాసమే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని ఆర్జీయూకేటీ (ఐఐఐటీ) శ్రీకాకుళం ప్రాంగణ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శనివారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎచ్చెర్లలోని తహశీల్దారు కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, ఎం.పి.డి.వో కార్యాలయ పరిసరాల్లో డైరెక్టర్ పర్యవేక్షణలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించి చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువత సైబర్ నేరాలు, లోన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా స్కామర్ల ఉచ్చులో పడకుండా తోటివారినీ చైతన్యపరచాలని సూచించారు.
శిబిరంలో భాగంగా ఎస్.ఎం.పురంలో వెటర్నరీ డాక్టర్ జి.సురేష్, ఐఐఐటీ డీన్ డాక్టర్ శివరామకృష్ణతో కలిసి వాలంటీర్లు మొక్కలు నాటారు.
బురిడి కంచరాం గ్రామంలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించగా.. కేశవరావు పేట, ఎస్.ఎస్.ఆర్. పురంలో అంగన్వాడీ మరియు పాఠశాల విద్యార్థులకు యోగా, ధ్యానం, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అలాగే 104 సేవలు, సచివాలయ పరిధిలోని ఆరోగ్య సదుపాయాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి డా.ముని రామకృష్ణ, డీన్ డా.శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా.వాసు, వెల్ఫేర్ డీన్ డా.రవి గేదెల, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు



డా.వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, పి.గాయత్రి, టి.అసిరినాయుడు, ఆర్.పద్మావతి పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**